# ఛాంపియన్

హైద్రాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో అంతర్జాతీయ కుస్తీ పోటీలు జరుగుతున్నాయి. మొత్తం నాలుగు రోజులు.

మొదటి రోజు రష్యాకి చెందిన పహిల్వాన్ గ్రొటోస్కీకి అమెరికాకి చెందిన రాబర్ట్‌కి జరిగాయి గ్రొటోస్కీ గెలిచాడు, అతను మళ్ళీ ఫ్రాన్స్‌కి చెందిన జీన్‌పాల్‌తో కుస్తీ పోటీలో పాల్గొని గెలిచాడు.

అదే రోజు పంజాబ్ పహిల్వాన్ శక్తి సింగ్‌కి, తమిళనాడు పహిల్వాన్ నటేశన్‌కి జరిగిన కుస్తీ పోటీలలో శక్తి సింగ్ గెలిచాడు. శక్తి సింగ్ మళ్ళీ బెంగాల్‌కి చెందిన శరత్‌బాబుతో గెలిచాడు.

రెండో రోజు ఆంధ్రప్రదేశ్‌కి చెందిన వెంకటేశ్వరరావుకి, శక్తి సింగ్‌కి కుస్తీ పోటీ జరిగింది. వెంకటేశ్వరరావు తేలికగా గెలిచాడు. అది ప్రేక్షకులకి, నిర్వాహకులకి ఆశ్చర్యం కలిగించిన విషయం. వెంకటేశ్వరరావు మొదటిసారి కుస్తీ పోటీలలో పాల్గొనడం. అతనికి పట్లు పెక్కుర్లు అటే తెలియవు. పైగా శక్తి సింగ్ కన్నా వెంకటేశ్వరరావుకి బరువు తక్కువే. కనీసం పది కిలోలు తక్కువుంటాడతను.

వెంకటేశ్వరరావు ఆరోజు మరో రెండు రాష్ట్రాలకి చెందిన పహిల్వాన్‌లని ఓడించడంతో అతని పరపతి పెరిగింది. అతను వోడించిన వాళ్ళంతా పది-పదిహేనేళ్ళుగా కుస్తీ పోటీలే తమవృత్తిగా స్వీకరించి, ఎందరినో ఓడించినవాళ్ళు. అందులో వాళ్ళకి తెలిసినన్ని మెళుకువలు వెంకటేశ్వరరావుకి తెలియదు.

మర్నాడు వెంకటేశ్వరరావు భారత ఛాంపియన్ అయ్యాడు. మరో నాలుగు రాష్ట్రాలకి చెందిన పహిల్వాన్‌లని తేలికగా ఓడించడంతో ఆ రోజు జాతీయ స్థాయినించి అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు వెంకటేశ్వర

రావు. మరో రెండు రోజులలో వరుసగా ఇంగ్లండ్, జర్మనీ, పోలెండ్, ఆస్ట్రేలియా దేశాలకు చెందిన మహా మనుషుల్ని కుస్తీ పోటీలో ఓడించాడు. అన్ని దినపత్రికలలోనిస్పోర్ట్స్ కాలాల్లో అతని ఫోటో వేసి, అతని గురించి రాసారు. కుస్తీ పోటీలంటే ఆసక్తి గల రాష్ట్రపతి కూడా అతన్ని అభినందిస్తూ టెలిగ్రాం పంపించాడు.

మర్నాడే ఆఖరి రోజు. ఆ రోజు భారత దేశానికి చెందిన వెంకటేశ్వరరావుకి, రష్యాకి చెందిన గ్రొటోస్కీకి పోటీ జరుగబోతుంది. వాళ్ళలో ఎవరు గెలుస్తే వారు ఆ సంవత్సరానికి ఛాంపియన్ అవుతారు.

గ్రొటోస్కీ వెంట వచ్చిన వాళ్ళలో ఒకతను రష్యన్ కె.జి.బి. (గూఢచారి సంస్థ) కి చెందిన వాడు, గ్రొటోస్కీ ఆ సాయంత్రం అతన్ని పిలిచి చెప్పాడు

"ఈ వెంకటేశ్వరరావు ఇంత మందిని తేలికగా ఓడించ గలుగుతున్నాడంటే, అది కేవలం అతని శారీరక ప్రతిభ కాదు. దాని వెనకాల ఏదో రహస్యం ఖచ్చితంగా వుండివుంటుందనిపిస్తోంది అదేమిటో కనుక్కొని నాకు చెప్పాలి. ఇందు కోసం నీ శక్తి యుక్తులన్నీ వినియోగించి తీరాలి. జయం మనదే అవాలి.

"ప్రయత్నిస్తాను" చెప్పాడా రష్యన్ గూఢచారి. వెంకటేశ్వరరావు తినే తిండి గురించి ఆరా తీసాడు. అతను శాకాహారి అని తెలిసి ఆశ్చర్యపోయాడు. మినప రొట్టె, పెసరట్ లాంటి తెలుగు వంటకాలు తింటాడు. కనీసం కోడిగుడ్డు కూడా తినడు.

అతను ఎవరి దగ్గర కుస్తీ పోటీలు నేర్చుకున్నాడో వాకాబు చేసాడు. మరో ఆశ్చర్యకరమైన విషయం ఆ గూఢాచారి దృష్టికి వచ్చింది అసలతను ఎవరి దగ్గరా కుస్తీ పోటీలు నేర్చుకోలేదు!!

అతని గురించిన అన్ని వివరాలు సేకరించాడు. వాటిలో ఏదో అతని విజయ రహస్యం తెలియచేయలేక పోయాయి.

వెంకటేశ్వరరావుకి సినిమాలంటే తగని పిచ్చి. ప్రతి రోజు రాత్రి వీడియోలో తెలుగు సినిమాలు వేసుకుని చూస్తాడన్న సంగతి వాటిలో వుంది. తెలుగు సినిమాలనే నెపంతో ప్రపంచంలోని కుస్తీ పోటీలని శ్రద్ధగా గమనిస్తున్నాడనే అనుమానం కలిగింది ఆ గుడాచారికి.

వెంకటేశ్వరరావు హోటల్ గదిలో ఆ వీడియో కెసెట్స్ దొంగిలించి వాటిని ఓ వీడియో పార్లర్‌లో వేసుకుని చూసాడు ఆ గూడాచారి.

తెలుగు సినిమాలు పూర్తిగా లేవు అందులో. కేవలం పాటలు మాత్రమే వున్నాయి. ఒకరిద్దరు నటులు హీరోయిన్స్‌తో కలసి అభినయించిన డ్యూయెట్స్ ఆపాటలన్నీ.

ఎగిరి గంతేశాడు ఆ గూడాచారి. గ్రొటోస్కీ దగ్గరకి పరిగెత్తి వెళ్ళి చెప్పాడు,

తెలుగు సినిమాల్లో హీరో, హీరోయిన్స్ డ్యూయెట్స్ పాడేప్పుడు చేసే నటన నుంచి కుస్తీ పోటీ చేసే వారు ఎన్నో అపూర్వ కొత్త మెళుకువలు నేర్చుకో వచ్చు. హీరో హీరోయిన్‌ని ఎన్నో వందల రకాలుగా దగ్గరికి తీసుకుని కదలకుండా పట్టుకో గలడు. పిండేయగలడు. పెండపడ గలడు.... మీరా పాటల్ని చూస్తే కాని వెంకటేశ్వరరావుని గెలవ లేరు"

వాటిని చూసే వ్యవధి లేదు గ్రొటోస్కీకి. ఫలితంగా వెంకటేశ్వర రావు ప్రపంచ ఛాంపియన్ అయ్యాడు ఆ సంవత్సరం. ఇప్పుడు రష్యన్ కుస్తీ పోటీ స్కూళ్ళలో తెలుగు డ్యూయెట్ పాటలున్న వీడియో రికార్డులు శిక్షణలో ఓ భాగంగా ప్రదర్శించి నేర్పే ఏర్పాటున్న సంగతి ప్రపంచంలో చాలా తక్కువ మందికి తెలుసు.